క్లుప్తంగా

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

జైనూర్: మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని షీటీం సభ్యురాలు సునీత అన్నారు. మండల కేంద్రంలో గురువారం మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు, మహిళలను ఆకతాయిలు వేధించినా, ఈవ్‌టీజింగ్ చేసినా షీటీమ్‌ను సంప్రదించాలన్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్‌లో వ్యక్తిగత సమాచారం, ఫొటో, వీడియోలు పోస్ట్ చేయొద్దన్నారు. ఆపద సమయంలో డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. షీటీం సభ్యురాలు శ్రీలత, స్వప్న తదితరులు ఉన్నారు.

ఛత్రపతి శివాజీ ఆశయాలు కొనసాగించాలి



విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఛత్రపతి శివాజీ మహారాజ్ ఆశయాలను కొనసాగించాలని ఆరె సంక్షేమ సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి నాగపురి మారుతి, మండల అధ్యక్షుడు గెడేకర్ సంతోష్ పిలుపునిచ్చారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని గురువారం ఆయన విగ్రహానికి ఆరె సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. దిలీప్‌కుమార్, ఆవిడపు ప్రణయ్, జక్కయ్య, బాలేష్, నాగరాజు, దేవరావ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ



చింతలమానెపల్లి: తనిఖీ చేస్తున్న ఏఈవో వెంకటేశ్

చింతలమానెపల్లి: మండలంలోని బాబాసాగర్ గ్రామంలో గురువారం ఫర్టిలైజర్ దుకాణాలను ఏఈవో వెంకటేశ్ తనిఖీ చేశారు. రికార్డులు, విత్తన సంచులు, స్టాక్ వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈవో మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విత్తనాలు, ఎరువులు విక్రయించాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు తీసుకునే విత్తనాలు, ఎరువులకు సంబంధించి రసీదు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.

కౌటాల: ఫర్టిలైజర్ షాపుల డీలర్లు నిబంధనలు పాటించాలని ఏఈవో చొదరి అంజన్న అన్నారు. మండలంలోని గుండాయిపేటలోని ఫర్టిలైజర్ షాపుల్లో గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రిజిస్టర్లు, విత్తన ప్యాకెట్లు, ఎరువులు, మందుల స్టాక్‌ను పరిశీలించారు. డీలర్లు అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని గేదె మృతి



మృతిచెందిన గేదె

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాకేంద్రంలోని జాతీయ రహదారిపై అటవీశాఖ చెక్‌పోస్ట్ వద్ద గురువారం ఉదయం గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనలో గేదె మృతిచెందింది. దీని విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని బాధితుడు అకంకుసాపూర్‌కు చెందిన బండి రాజశేఖర్ తెలిపాడు. వాహనాన్ని సీసీ కెమెరా ద్వారా గుర్తించి తనకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను కోరాడు.

కళాశాలలో ఎంపీసీ సీట్లు

దహెగాం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతనంగా ఎంపీసీ గ్రూపులో సీట్లు మంజూరైనట్లు ప్రిన్సిపాల్ అమరేందర్ ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో కళాశాలలో కేవలం బైపీసీ, సీఈసీ గ్రూపులు ఉండగా, ఉన్నతాధికారులు ఎంపీసీ గ్రూప్ ప్రారంభించడానికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీలో చేరడానికి కళాశాలలో సంప్రదించాలని కోరారు.

కాడెద్దులు కనుమరుగు

- సాగులో పెరిగిన ట్రాక్టర్ల వినియోగం
- గంటకు రూ.600 నుంచి 800 చార్జీ
- రైతుకు భారంగా అద్దె



ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న రైతు

కెరమెరి: గతంలో ప్రతి రైతు ఇంటి వద్ద కాడెద్దులు ఉండేవి. ఎడ్లబండి దర్శనమిచ్చేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. ట్రాక్టర్ల రాకతో కాడెద్దులు కనుమరుగయ్యాయి. నాడు వ్యవసాయంలో కాడెద్దులు ముఖ్యభూమిక పోషించేవి. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో అరకలతో వ్యవసాయ భూములను దున్నుతున్నారు. దీంతో అనేక మంది వద్ద ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. యజమానులు గంటకు రూ.600 నుంచి 800 వరకు చార్జీ వసూళ్లు చేస్తున్నారు. ఏటా సాగు వ్యయం పెరుగుతుండడం, ఎరువులు, క్రిమిసంహారక మందులు, విత్తనాల ధరలకు తోడు కూలీల రేట్లు గణనీయంగా పెరిగాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. మండలంలో 31 పంచాయతీలో 8194 రైతులు ఉండగా 29,456 ఎకరాల్లో పంటలు సాగుచేస్తున్నారు.

పెరిగిన ట్రాక్టర్ల వాడకం

వ్యవసాయ యాంత్రీకరణ నేడు తారాస్థాయికి చేరింది. ముఖ్యంగా అన్ని పనులకు ట్రాక్టర్ వినియోగం పెరిగింది. నాడు పది ఊర్లకు ఒకటి రెండు ఉండగా ఇప్పుడు ఒక్కొక్క గ్రామంలో పదేసి ట్రాక్టర్ల వరకు పెరిగాయి. ప్రభుత్వాలు రాయితీపై ట్రాక్టర్లు, యంత్ర పరికరాలు అందిస్తోంది. ఈనేపథ్యంలో కాడెద్దుల ప్రాధాన్యం పూర్తిగా తగ్గుతూ వస్తుంది. అప్పట్లో ప్రతీ ఊరిలో 90 శాతం మంది రైతు కుటుంబాల్లో కాడెద్దులు ఉండగా ప్రస్తుతం 10 శాతం కుటుంబాల్లో కనిపించడం లేదు.

బీడు భూములుగా..

వ్యవసాయం ఖర్చు నానాటికి పెరగడంతో అనేక మంది రైతుల భూములు బీడుగా మారుతున్నాయి. ఖర్చు చేసేందుకు డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకు అధికారులు అనుకున్న స్థాయిలో రుణాలు ఇవ్వడం లేదు. దీంతో వ్యాపారులు, వడ్డీదారుల వద్ద చేరాల్సిన పరిస్థితి నెలకొంది. అధిక వడ్డీ వసూళ్లతో ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



వ్యవసాయం పెను భారమవుతుంది. ఎడ్లు కొనుగోలు చేయాలంటే స్థోమత లేదు. గతంలో ఎడ్లు కావాలని అధికారులకు దరఖాస్తులు చేసినం. కాని ఎలాంటి స్పందన లేదు. ట్రాక్టర్లతో పొలాన్ని దున్నుతున్నా. గంటకు రూ.700 చెల్లిస్తున్నా. ప్రభుత్వం ఆదుకోవాలి.

– సిడాం మానిక్‌రావు, రైతు, శివగూడ

మెరిసిన ఆణిముత్యాలు

- ఉన్నత చదువుల్లో ముగ్గురు అక్కాచెల్లెల్లు
- నీట్ ఫలితాల్లో ప్రతిభ చాటిన మూడో కుమార్తె
- ప్రభుత్వ విద్యాలయాల్లోనే విద్యాభ్యాసం



అజ్మీర శైలజ



తల్లిదండ్రులు భీములు సవితతో కుమార్తెలు

చింతలమానెపల్లి: మండలంలోని లంబాడిహేటి గ్రామానికి చెందిన అజ్మీర భీములు-సవితలది వ్యవసాయ కుటుంబం. వీరికి ముగ్గురు కుమార్తెలు శ్యామల, శమీల, శైలజ కుమారుడు కార్తీక్. వ్యవసాయ కుటుంబం అయినా తండ్రి భీములు తన కుమార్తెలు ఉన్నతంగా చదివించారు. అందుకు తగినట్లుగా వారు చదువులో ప్రతిభ చాటుతున్నారు. పెద్ద కుమార్తె శ్యామల కరీంనగర్‌లో ఫిజియోథెరఫీ కోర్సు పూర్తి చేసి ఉద్యోగం చేస్తోంది. ద్వితీయ కుమార్తె శమీల ఫార్మసీలో డాక్టరేట్(ఫార్మ్-డీ) కోర్సు మూడవ సంవత్సరం చదువుకుంటోంది. మూడవ కుమార్తె శైలజ తన ఇద్దరు అక్కల బాటలో నీట్ పరీక్షకు హాజరు కాగా వచ్చిన ఫలితాల్లో 580 మార్కులతో కేటగిరీ 820వ ర్యాంకు సాధించింది. ముగ్గురు అమ్మాయిల విద్యాభ్యాసం ప్రభుత్వ గురుకులాలు విద్యాలయాల్లోనే పూర్తి చేశారు. వైద్య రంగంలో ఉన్నత స్థాయికి చేరుకుని, మారుమూల ప్రాంతాల పేదలకు వైద్యం అందించాలన్నది తన ధ్యేయమని శైలజ తెలియజేసింది.

ఈజీఎస్ సిబ్బందితో సమీక్షా సమావేశం

వేమనపల్లి: అన్ని గ్రామపంచాయతీల్లో ఉపాధిహామీ కూలీలకు పనులు కల్పించాలని ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. హరితహారం మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. పర్యావరణ దినోత్సవంలో భాగంగా అన్ని గ్రామపంచాయతీల్లో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీపతి బాపురావు, ఏపీవో సత్యప్రసాద్, ఈసీ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్

రెబ్బెన: గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెండెంట్ వేణుకు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు గత ఆరు నెలలుగా వేతనాలు అందించలేదన్నారు. మండలంలో సుమారు ఏడాదిపైగా వేతనాలు అందక కుటుంబ పోషణకు మనోవేదనకు గురవుతున్నారని అన్నారు. తమ డిమాండ్ల సాధన కోసం కార్మికులు గతేడాది సమ్మె చేస్తే ప్రభుత్వం కార్మిక సంఘాలతో చర్చించి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా నేటికి అమలు కాలేదన్నారు. జీవో 60 ప్రకారం కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్మికులు శంకర్, వెంకటేశ్, అన్నాజీ, శంకర్, సంతోశ్, రమేశ్, వెంకటేశ్, కిరణ్ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో శనీశ్వరుడికి పూజలు



శనీశ్వరుడి విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు



కాళభైరవుడికి పూజలు చేస్తున్న భక్తులు

రెబ్బెన: శని జయంతి సందర్భంగా మండలంలోని ఇందిరానగర్‌లో గల శనీశ్వరుడికి భక్తులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శని జయంతితోపాటు అష్టా గ్రహకూటమి కావడంతో శనీశ్వరుడికి దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. జిల్లాలో ఉన్న ఏకైక శనీశ్వరాలయంలో విగ్రహానికి నువ్వుల నూనె, నువ్వులతో అభిషేకం చేశారు. వేద పండితుడు మహేశ్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో కాళభైరవుడికి పూజలు నిర్వహించారు. కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయ ప్రధాన అర్చకుడు దేవార వినోద్ పాల్గొని భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



కొట్టుకుపోయిన తాత్కాలిక వంతెన



పొంగి ప్రవహిస్తున్న వరదనీరు

పొంగిన లక్మాపూర్ వాగు!

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని లక్మాపూర్ వాగు పొంగి గురువారం ప్రవహించింది. దీంతో కెరమెరికి వచ్చి ప్రజలు వాగు ఇవతల చాలాసేపు నిరీక్షించాల్సి వచ్చింది. లక్మాపూర్‌లో పెద్దగా వాన కురవనప్పటికి వాగు పై భాగంలో ఎక్కడో కొన్నిచోట్ల వర్షం కురిసింది. దీంతో వాగు పొంగడంతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన వంతెన పూర్తిగా కొట్టుకుపోయింది. ఫలితంగా ప్రజల రాకపోకలకు ఇబ్బంది తప్పలేదు. గతేడాది చిన్నారిని చేతిలో ఎత్తుకుని నీటిని దాటుతున్న ‘బాహుబలి’ సీన్ విధితమే. ఇంత జరిగినప్పటికి అధికారులు వంతెన పనులు ప్రారంభించలేదు. ఈ సంవత్సరం కూడా అదే పరిస్థితి ఎదురవుతే ఎలా అని లక్మాపూర్ వాసులు ఆందోళన చెందుతున్నారు.

గ్రామాల్లో ‘బడిబాట’ ప్రారంభం



చింతలమానెపల్లిలో బడిబాట ర్యాలీ



దహెగాం: ఇట్యాలలో బడిబాట ర్యాలీ

వాంకిడి: జిల్లాలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయులు, గ్రామస్తులు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం 19వ తేదీవరకు కొనసాగనుంది. వాంకిడి మండలంలోని కనర్‌గాం, ఖమాన గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో పాఠశాలల విద్యార్థులు, గ్రామస్తులతో కలిసి ర్యాలీ చేపట్టారు. కార్పొరేట్‌కు దీటుగా సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ఐకేపీ ఏపీఎం మహేశ్, సిబ్బంది సురేందర్, ఆనంద్‌రావు, మోహన్, ఎస్‌హెచ్‌జీ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

దహెగాం: ఇట్యాల గ్రామంలో ఉపాధ్యాయులు, మహిళా సంఘాల సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు, పంచాయతీ సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. జెడ్పీఎస్ఎస్ హెచ్‌ఎం వీరశంకర్, పీఎస్ హెచ్‌ఎం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో ఉపాధ్యాయులు గ్రామస్తులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం విజయ నిర్మల తదితరులు ఉన్నారు.

కెరమెరి: మండలంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక ఆశ్రమ, కేజీబీవీల్లో బడిబాట కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంఎన్‌వో ఆడే ప్రకాశ్, ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేశారు. కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, హెచ్‌ఎంలు, వీవో, ఎస్‌హెచ్‌జీ, ఏఏపీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: బడీడు పిల్లలు పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో మను కుమార్ అన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు బడిబాట నిర్వహించారు. టీచర్లు హేమంత్, శ్రీనివాస్, రమేశ్ విద్యార్థులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: మండల కేంద్రంలోని పాఠశాల నుంచి బడిబాట ర్యాలీ నిర్వహించారు. జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జయరాజ్‌తోపాటు కార్యదర్శి ఆసిఫ్ అలీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కౌటాల: మండలంలోని ముత్తంపేట జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలలకు అన్ని వసతులు కల్పిస్తామని హెచ్‌ఎం గావుడే హన్మంతు తెలిపారు.



వాంకిడి: కనర్‌గాంలో బడిబాట ర్యాలీ



పెంచికల్‌పేట్‌లో బడి బాట ర్యాలీ



కెరమెరి: ర్యాలీ నిర్వహిస్తున్న గోయగాం విద్యార్థులు

గుంతలమయం



కెరమెరి: మండలంలోని సుల్తాన్‌గూడ సమీపంలో ఉన్న ప్రధాన రోడ్డు వంతెనకు ఏర్పడిన గుంతలతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఏళ్ల క్రితం నిర్మించిన వంతెనకు ఇప్పటివరకు ఎలాంటి మరమ్మతు చేపట్టలేదు. ద్విచక్రవాహనదారులు గుంతల్లో పడిన సందర్భాలున్నాయి. ఆసిఫాబాద్ నుంచి ఆదిలాబాద్‌కు వెళ్లేదారి ఇదే కావడంతో ఈ వంతెనపై వాహనాలు అనేక సంఖ్యలో వెళ్తుంటాయి. అధికారులు స్పందించి మరమ్మతు చేపట్టాలని మండల వాసులు కోరుతున్నారు.

ప్రైవేట్ ఆస్పత్రులు తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులను గురువారం పీసీ అండ్ పీఎన్‌డీటీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సిద్దార్థ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రులు నిబంధనలు పాటించాలన్నారు. లింగ నిర్ధారణ చేస్తున్నట్లు తమ దృష్టికి వస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఆస్పత్రిని నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో నాగలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్లు మణికాంత్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు పెంచాలి.. పర్యావరణాన్ని రక్షించాలి



మొక్కలు నాటుతున్న అటవీశాఖ అధికారులు

జైపూర్: భావితరాలకు చక్కటి పర్యావరణాన్ని అందించడానికి మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని అటవీశాఖ డిప్యూటీ రేంజర్ సాగరిక తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జైపూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులంలో గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గురుకలం పరిసరాల్లో మొక్కలు నాటి వాటి ప్రాముఖ్యతను వివరించారు. మొక్కలు మానవులకు ప్రాణవాయువును అందిస్తున్నాయని వాటిని రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. చెట్లు అంతరించిపోవడం మూలంగా అనేక అనర్థాలు ఏర్పడుతాయని, పర్యావరణ సమతుల్యత కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎఫ్‌ఎస్‌వో రామ్‌సింగ్, ఎఫ్‌బీవోలు సతీశ్, దీక్ష, పంచాయతీ కార్యదర్శి ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు పనులు కల్పించాలి

భీమిని: ఉపాధిహామీ కూలీలకు పనులు కల్పించాల ని జెడ్పీ సీఈవో గణపతి సూచించారు. మండల కేంద్రంలో గురువారం అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. జాబ్‌కార్డు కలిగి న ప్రతి వ్యక్తికి కూలీ పనులు కల్పించాలన్నారు. ప్రతి కూలీకి రూ.300 వేతనం అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో సబ్దర్‌అలీ, ఏపీవో భాస్కర్, ఈసీ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయం తనిఖీ

నెన్నెల: స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని గురువారం మంచిర్యాల జెడ్పీ సీఈవో గణపతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయ ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించారు. మండలంలో మొత్తం ఎన్ని గ్రామాలు ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. కూలీకి రోజు వారీ కూలీ ఎంత వస్తుందో ఏపీవో నరేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో నరేష్ ఉన్నారు.